అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం 12 మే 2023

బీజేపీ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు



నవతెలంగాణ-నవీపేట్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ అమీర్‌కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు పెట్టిన బిజెపి నాయకులపై పోలీసులకు బిఆర్ఎస్ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా మండల యువజన అధ్యక్షుడు సాయి కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే షకీల్ కు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తున్న బిజెపి నాయకులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాగేపూర్ ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, అర్షద్, సాయి తేజ, శివ, సురేష్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పట్టణ బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు


మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పట్టణ బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత పవన్, కన్వీనర్ గా మున్సిపల్ కమిషనర్ అశోక్ చౌహన్, వీరితో పాటు వివిధ శాఖల నుండి ఒక్కొక్క సభ్యులను ఇందులో ఉంటారు. బాల్య వివాహాలు జరగకుండా చూసుకోవడం, పిల్లల మీద లైంగికదాడులు జరగకుండా, పిల్లలు బడి మానివేయకుండా ఉండుట, బాల కార్మికులు లేకుండా చూడడం, 18 సంవత్సరాల లోపు పిల్లల క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని పని చేయనున్నట్టు చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ భార్గవి, చైతన్య గణేష్ పోలీస్ న్యాయ ,ఆరోగ్య విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల లొల్లి

- బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ
- బోధన్‌లో వేడెక్కుతున్న రాజకీయం


ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చింపేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-బోధన్

బోధన్ నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇప్పటి నుంచే బోధన్ పట్టణంలో రాజకీయం రంజుగా మారింది. బిజెపి వర్సెస్ బీఆర్ఎస్‌గా తయారైంది. దీనికి ప్రధానంగా ఫ్లెక్సీలు వివాదానికి కారణమవుతున్నాయి. ఫ్లెక్సీల లొల్లి కాస్త పోలీసు స్టేషన్ వరకు చేరింది. ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ కనపడటం లేదని బీజేపీ పార్టీ వారు ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారని పేర్కొంటూ బిఆర్ఎస్ నాయకులు రవిశంకర్ గౌడ్, బుద్దె రాజేశ్వర్, నూర్ ఆహ్మద్, సురేష్, డిస్కో సాయిలు బిజెపి నాయకులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. బీజేపీ కార్యకర్తలు బోధన్ నియోజకవర్గంలోని ఎడపల్లి, బోధన్, సాలూరులో బుధవారం రాత్రి ఎమ్మెల్యే కనబడతలేరని, రైతులకు సంబంధించిన తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తానని చెప్పి కనబడతలేరని రాసి ప్రధాన కూడళ్లలో ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ బొమ్మతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దీన్ని గమనించిన టిఆర్ఎస్ నాయకులు వాటిని చించివేశారు. ఈ ఘటనపై బోధన్ పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్ గురువారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బిజెపి నాయకుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి నాయకులు ఇలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. ఎడపల్లి మండలంలో జరిగిన ప్లీనరీ సమావేశంలో రైతులకు సంబంధించిన తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తానని ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ మాట ఇచ్చారని, దానికి అనుగుణంగా ఇప్పటివరకు అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో రైస్ మిల్లర్ ద్వారా 95% వరకు ధాన్యం కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. అయినా కానీ బిజెపి నాయకులు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ పై ఇలా నీచ రాజకీయం చేస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం సిగ్గుచేటని మండలించారు. బిజెపి నాయకులకు ధైర్యం ఉంటే రైతులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని సవాలు చేశారు. రైస్ మిల్లర్ల ప్రతినిధిగా ఉన్న బిజెపి నేత రైస్ మిల్లర్లకు లాభం చేకూరుస్తూ రైతులను నష్టం చేసేలా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు.

అలాగే సాలూర మండలంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు బీఆర్ఎస్ నాయకులు బుధవారం రాత్రి చించివేశారు. అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్లో బిజెపి నాయకులపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బుద్దె రాజేశ్వర్ మాట్లాడుతూ గత 9 సంవత్సరాల కాలంలో ఎమ్మెల్యే షకీల్, ఏనాడు రైతులకు ఇబ్బంది కలిగించలేదని రైతు నేతగా పేరుగాంచిన ఆయన వారు ధాన్యం నష్టపోకుండా ప్రభుత్వం కొనుగోలు చేసేలా కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్యే షకీల్ అమీర్‌ను బదనాం చేసేలా ఫ్లెక్సీలు పెట్టడం సరికాదని మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దని హెచ్చరించారు. ఏదేమైనా బోధన్ నియోజకవర్గంలో టిఆర్ఎస్ వర్సెస్ బిజెపి నేతల దూకుడుతో రాజకీయం వేడెక్కింది. గతంలోనూ ఓ నేత తన ట్రస్టు ద్వారా ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ సైతం పట్టణంలో వివాదాస్పదం అయింది.

మొరం దందాలో అంతర్యుద్ధం

మద్యం మత్తులో రాత్రిపూట ఇంటిపై దాడి
హత్యాయత్నానికి పాల్పడ్డాడంటూ ఫిర్యాదు



నవతెలంగాణ-నవీపేట్

మొరం దందాలో వ్యాపారుల మధ్య విభేదాలు తారా స్థాయికి చేరి దాడులకు సైతం ఎగబడుతున్నారు. మద్యం మత్తులో రాత్రిపూట ఇంటిపై దాడి చేసిన ఘటన బుధవారం రాత్రి నవీపేట్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రంలో ప్రముఖ వ్యాపారవేత్త చేపట్టిన వెంచర్‌లో మొరం తరలించేందుకు స్థానికులైన నలుగురు మొరం వ్యాపారస్తులు కలిసి ఒప్పందం కుదుర్చుకున్నారు. అందులో భాగంగా అధికార యంత్రాంగంతో పాటు అడ్డొచ్చే వారిని సైతం మచ్చిక చేసుకుని 70 శాతం మొరం తరలించి మూడు పువ్వులు ఆరు కాయలుగా దందా కొనసాగించారు. ఆ నలుగురిలో ఒడ్డే సాయిలు మరియు జెసిబి శేఖర్‌ల మధ్య లావాదేవీలు, ఆధిపత్య పోరు రావడంతో అంతర్యుద్ధం మొదలైంది. గతంలోనూ వీరి మధ్య తగాదాలు ఉండడంతో బుధవారం రాత్రి వడ్డే సాయిలు మద్యం మత్తులో మరో ముగ్గురుని వెనుకేసుకుని వచ్చి మండల కేంద్రంలోని రామాలయ వీధిలో మొదటి అంతస్తులో అద్దెకు వుంటున్న శేఖర్ ఇంటికి వెళ్లి బయట వున్న పూలకుండిని తీసుకొని దాడి చేశాడని, ఇంటిలోని వస్తువులను పడేసి తనపై హత్యాయత్నం చేసేందుకు ప్రయత్నించాడని తాళ్ల శేఖర్ ఆరోపించారు. తనకు అధికార పార్టీ నాయకుల అండదండలు పుష్కలంగా ఉన్నాయని బండ బూతులు తిట్టి దాడి చేశాడని, ఇంటి యజమానికి గట్టిగా శబ్దాలు రావడంతో వచ్చి సాయిలు, అతని అనుచరులను బయటికి పంపించాడని తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటన స్థలానికి వచ్చి పోలీసులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. కాగా గురువారం ఉదయం పోలీస్ స్టేషన్ లో ఇంటిపై దాడి చేసి, హత్యాయత్నం చేశాడని ఫిర్యాదు చేసినట్లు తాళ్ల శేఖర్ మీడియాకు తెలిపాడు. తనకు ప్రాణహాని ఉందని పోలీసులు రక్షణ కల్పించాలని ప్రాధేయపడ్డాడు.


దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

కాగా మండలంలో మొరం మాఫియా పట్ల అధికార యంత్రాంగం "మామూలు"గా తీసుకోవడంతో ఆగడాలు విపరీతంగా పెరిగిపోయి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో మరిన్ని ఆగడాలు పెరిగిపోతాయని అధికార పార్టీ పేరు చెప్పుకొని ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడడంతో పార్టీ ప్రతిష్ట సైతం దిగజారిపోతుందని పలువురు అధికార పార్టీ నేతలు సైతం ఆవేదన చెందుతున్నారు.

పేదరికం చదువుకు అడ్డం కాకూడదు

- విద్యార్థినిని అభినందించిన స్పీకర్ పోచారం


విద్యార్థిని ఉమ్రా మహవీన్‌ను అభినందిస్తున్న స్పీకర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

పేదరికం చదువుకు అడ్డంకి కాదని కష్టపడి చదివితే గొప్ప ఫలితాలు వస్తాయని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు వచ్చిన విద్యార్థులకు గురువారం స్పీకర్ నివాసంలో అభినందించి సన్మానించారు. ఇందులో భాగంగా ఇంటర్మీడియట్లో బైపీసీ రెండవ సవంత్సరంలో 994 మార్కులతో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించిన ఉమ్రా మహవీన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పోచారం మాట్లాడుతూ యావత్ తెలంగాణలోనే బాన్సువాడ నియోజకవర్గం పేరును నిలబెట్టిన ఉమ్రా మహవీన్‌ను అభినందించారు. పేదరికం చదువుకు అడ్డంకి కాదని కష్టపడి చదివితే ఇలాంటి గొప్ప ఫలితాలు వస్తాయని తెలిపారు. ఉమ్రా మహిన్ తల్లిదండ్రులు ఎండీ అశ్వక్, యాస్మిన్ బేగంను కుటుంబ సభ్యుల కృషిని స్పీకర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల , కాలేజీల యాజమాన్యాలు, నాయకులు తదితరులు ఉన్నారు.

రైతులను కేంద్రం ఆదుకోదా..?

- బీజేపీ నాయకులు పంట నష్టం సాయం చేయించాలి
- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

రైతులపై ప్రేమ ఉంటే అకాల వర్షాలతో వడగళ్ల వానతో నష్టపోయిన రైతులకు కనీసం 15 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం నుంచి అందించే దమ్ము ధైర్యము బిజెపి నాయకులకు ఉందా అని ఎమ్మెల్యే ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ రైతు బాంధవుడు కాబట్టే అకాల వర్షానికి నష్టపోయిన ప్రతి రైతుకు పదివేల ఆర్థిక సహాయం అందించేందుకు కసరత్తు చేస్తున్నారని తెలిపారు. సీఎం కేసీఆర్ దేశానికి ఆదర్శమైన పథకాలను పేదలకు అందజేస్తున్నారని తెలిపారు. నిజామాబాద్ రూరల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 87 మందికి (రూ. 8,710,092 విలువ) మంజూరైన కళ్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను క్యాంప్ కార్యాలయంలో గురువారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం పని చేస్తుందని తెలిపారు. ఎన్నికల ముందు కేసీఆర్ ఇచ్చిన అన్ని హామీలనూ నెరవేర్చారని అన్నారు. ఆసరా ఫించన్, రైతుల కోసం రైతు బంధు. రైతు భీమా, 24 గంటలు ఉచిత కరెంట్, పేదల కోసం షాదీ ముబారక్ , కళ్యాణ లక్ష్మి వంటి అనేక పథకా లను అర్హులైన ప్రజలు ఆస్వాదిస్తున్నారని పేర్కొ న్నారు.

'గత ప్రభుత్వాలు ఆడ పిల్లల పెళ్లిళ్ల కోసం ఆలోచించలేదు. ఆడ పిల్లల పెళ్లిళ్లు చేయాలంటే తల్లిదండ్రులకు తలకు మించిన భారంగా ఉండేది. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక ఆడపడుచులకు అండగా ఉంటు వారి పిల్లల పెళ్లిళ్లకు లక్ష నూట పదహారు రూపాయలు అందించి వారి కుటుంబ ం లో ఒకరిగా ఉన్న ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్' అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మేనమామ కట్నంగా కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని, పేద మధ్య తరగతి కుటుంబాలకు పెళ్లి ఖర్చులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న లక్ష నూట పాదాలు రూపాయలు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్ల భారం కావొద్దనే సీఎం కేసీఆర్ ఈ పథకాలను ప్రవేశపెట్టార న్నారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతు న్నారని ప్రశంసించారు.

'అ'సమగ్ర శిక్ష

- సమగ్ర శిక్ష కార్యాలయంలో ప్రధాన పోస్టులన్నీ ఖాళీ
- ఫైనాన్స్, ప్లానింగ్ అన్ని ఒకరికే
- నెలలో స్కూళ్లు ప్రారంభం
- పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టేనా?

విద్య మా హక్కు
సమగ్ర శిక్షా
అందరూ చదవాలి - అందరూ ఎదగాలి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

పేద విద్యార్థులు విద్య నందించడంలో కీలకంగా ఉన్న సమగ్ర శిక్ష కార్యాలయం ఖాళీలతో వెక్కిరిస్తోంది. జిల్లాలోని కీలకమైన ప్రధాన పోస్టులన్నీ ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా సమగ్ర శిక్ష గాడి తప్పుతోంది. మరో నెల రోజుల్లో స్కూళ్లు ప్రారంభం కానున్నాయి. జూన్ 1వ తేదీ నాటికే విద్యార్థులకు పుస్తకాలతో పాటు యూనిఫామ్స్ అందజేయాలని సర్కారు ఆదేశించింది. కానీ జిల్లాలో అనుకున్న లక్ష్యం చేరలేని పరిస్థితి నెలకొంది. ఇక కీలకమైన బాధ్యతలన్నీ ఒకరికే అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫైనాన్స్ విభాగంతో పాటు ప్లానింగ్, క్వాలిటీ, ఐఅండ్ఈ తదితర విభాగాల బాధ్యతలను ఒకరికే అప్పగించారు. ఇక కార్యాలయంలో కీలక పోస్టులు ఖాళీ ఉండటంతో ప్రస్తుతం ఉన్న సిబ్బందిపై అధిక పని భారం పడుతోంది. ఇప్పటికే జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది.

వివరాలు మెయిన్‌లో..

మార్కులే ముఖ్యం కాదు

- ఫెయిల్ అయితే బాధపడొద్దు: కలెక్టర్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

విద్యార్థులకు మార్కులే ముఖ్యం కాదని, కాబట్టి ఫెయిల్ అయ్యామని బాధపడొద్దని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాసి రెండవసారి ప్రయత్నంలో విజయం సాధించవచ్చని చెప్పారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ అనుతీర్ణత పొందిన విద్యార్థులకు జీవితంలో ఎన్నో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. విద్యార్థులకు మార్కులు ముఖ్యం కాదని, వారిని తల్లిదండ్రులు తక్కువ అంచనా వేయకూడదని సూచించారు. తాను కూడా ఐఏఎస్ మొదటి ప్రయత్నంలో అను ఉత్తీర్ణత పొందినట్లు చెప్పారు. రెండవ ప్రయత్నంలో ఐఏఎస్ ఉత్తీర్ణత సాధించి కలెక్టర్ అయ్యానని పేర్కొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేయాలి

- రైస్‌మిల్లర్‌లకు జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ సూచన


సమీక్షిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రమోహన్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

లక్ష్యానికి అనుగుణంగా రైస్ మిల్లర్లు మిల్లింగ్ చేయాలని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో గురువారం రైస్ మిల్లర్లతో ధాన్యం మిల్లింగ్ లక్ష్యాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రైస్ మిల్ యజమానులు లక్ష్యానికి అనుగుణంగా మిల్లింగ్ చేపట్టకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఎస్ఓ పద్మ, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ అభిషేక్ సింగ్, అధికారులు, రైస్ మిల్ యజమానులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరా..?

- సర్వీస్ రోడ్డు వేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న వారిని సముదాయిస్తున్న పోలీసులు, హైవే అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజల విలువైన ప్రాణాలు పోతున్నా నేషనల్ హైవే అథారిటీ పట్టించుకోవడం లేదని ఇంకెన్ని ప్రాణాలు తీసుకుంటారని సర్పంచ్‌లు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. డిచ్‌పల్లి మండలంలోని జాతీయ రహదారి 44 సీఎంసీ మెడికల్ కాలేజీ నుండి నుండి యానంపల్లి రోడ్డు వరకు జాతీయ రహదారి వెంబడి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని చుట్టూ పక్కల 10 గ్రామాల నుండి తరలివచ్చిన గ్రామ ప్రజలు సుద్దపల్లి వద్ద సీఎంసీ వద్ద 44 జాతీయ రహదారిపై రాస్తారోకో చేసే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. మండలంలోని సుద్దపల్లిలో జాతీయ రహదారిపై చుట్టుపక్క 10 గ్రామాల సర్పంచ్‌లు, ప్రజలు ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారి పొడిగింపు సమయం నుండి నేటి వరకు సర్వీస్ రోడ్డు కోసం విన్నవిస్తూనే ఉన్నా పెడచెవిన పెడుతూ ఎన్నో కుటుంబాలను శోకానికి గురి చేస్తున్నారని అన్నారు. సర్పంచులు పానుగంటి రూప సతీష్‌రెడ్డి, వెంకటేష్, నర్సయ్యలు మాట్లాడుతూ వెంటనే సర్వీస్ రోడ్డు ఇరువైపులా ఏర్పాటు చేయాలని వారందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. 14 సంవత్సరాల కాలంలో 50 మందికిపైగా మృత్యువాత పడ్డారని, వందలాది మంది ఇప్పటి వరకు క్షత గాత్రులు అయ్యారని వాపోయారు. ఎప్పటి నుంచో సర్వీస్ రోడ్డు కోసం ప్రయత్నం చేసి వచ్చిన అధికారులకు వినతి పత్రాలను అందజేయడం ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పు డల్లా సమీప గ్రామాల ప్రజలు రహదారిపై ధర్నాలు నిరసన వ్యక్తం చేసినప్పుడు అధికారులు రావడం ప్రజలకు మాయమాటలు చెప్పి వెళ్లిపోవడం జరుగుతుందని కానీ ప్రజల విలువైన ప్రాణాలను మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. కనీసం తాత్కాలిక రోడ్డు వేయాలని 10 గ్రామల సర్పంచ్లు నేషనల్ హైవే అథారిటీ అధికారులను కోరారు. ప్రతినిత్యం వందలాల వాహనాలు డిచ్‌పల్లి రాకపోకలు సాగిస్తూ ఉంటాయని కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఈ రహదారి ఉందన్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు కల్పించుకొని సీఎంసీ వద్ద ఫ్లై ఓవర్ నిర్మించినప్పుడే రోడ్డు ప్రమాదలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలు 10 గ్రామాలకు చెందిన బాధితులు, ప్రజలు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంటర్ మూల్యాంకన పారితోషకం చెల్లించాలి


వినతిపత్రం అందజేస్తున్న లెక్చరర్స్ ఫోరం ప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్మీడియట్ మూల్యాంకన పారితోషకం చెల్లించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం ప్రాంతీయ ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో వినతి పత్రం అందజేసి మాట్లాడారు. 2022-23 విద్య సంవత్సరానికి సంభంధించిన పేపర్ మూల్యాంకన ప్రక్రియ పూర్తయి సుమారు 20 రోజులు దాటినప్పటికీ సంబంధిత పారితోషికం ఇంతవరకు చెల్లించలేదని తెలిపారు. వేసవి సెలవుల సమయంలో జిల్లాలోని దాదాపు 80 శాతం కళాశాలల్లో 10 లేదా 11 నెలల జీతం మాత్రమే చెల్లిస్తున్నారని, ముల్యంకన పారితోషకమే తమ కుటుంబాలకు జీవనాధారమని అన్నారు. శ్రామికుని ముఖంపై చిందిన స్వేదం ఆరకముందే ముట్ట చెప్పాల్సిన ప్రతిఫలాన్ని పలితాలు ప్రకటించినా ముట్ట చెప్పక పోవడం శోచనీయమని అన్నారు. వెంటనే తమ పారితోషికం ఇప్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ ఏం మల్లికార్జున గౌడ్, టౌన్ ప్రెసిడెంట్ గజానంద్, ఆర్మూర్ ప్రెసిడెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని రెగ్యులర్ చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్

సమగ్ర శిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందర్నీ రెగ్యులరైజ్ చేయాలని, పేస్కేల్ వర్తింపచేయాలని యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ రవి కిరణ్ కోరారు. గురువారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేసి తమ కుటుంబానికి రూ. 5 లక్షల జీవిత బీమా, రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ రవి కిరణ్, దప్పు దిలీప్, సిఆర్పి అంబదాస్, జిల్లా కార్యాలయ ఏపీవో అష్రఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అండగా ఉంటాం

- అనిల్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేసిన మంత్రి వేముల


అనిల్‌ను పరామర్శించి కుటుంబీకులతో మాట్లాడుతున్న మంత్రి వేముల

నవతెలంగాణ-భీంగల్

ఈ నెల 9న పల్లికొండ శివారులో పిడుగు పడి 40 గొర్రెలు మృతి చెందగా, గాయాలపాలైన కర్రోల్ల అనిల్ యాదవ్‌ను గురువారం ఆయన స్వగృహంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరామర్శించారు. 50 వేల రూపాయలను ఆర్థికసాయంగా అందజేసి ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని వారి కుటంబానికి భరోసా కల్పించారు. పిడిగు పాటు వల్ల షాక్‌లో ఉన్న అనిల్‌ను చికిత్సపై ఆరా తీసి వారి కుటంబానికి మనోధైర్యాన్ని కల్పించారు. ఈ ఘటనలో 40 గొర్రెలను కోల్పోయి తీవ్రంగా నష్టపోయిన బాదితుడిని ఎన్డీఆర్ఎఫ్ కింద సహాయం అందేలా చూడాలని జిల్లా కలెక్టర్‌కు ఫోన్ ద్వారా ఆదేశించారు. పిడుగుపాటు ఎన్‌డీఆర్ఎఫ్ కింద రాదని కలెక్టర్ మంత్రి తెలపడంతో అక్కరకు రానీ కేంద్ర పథకాలు ఎందుకని అసహనం వ్యక్తం చేశారు. రెండో విడత గొర్రెల పంపిణిలో బాదితునికి అందేలా చర్యలు చూడాలని ఆదేశించారు. మంత్రి వెంట ఎంపీపీ ఆర్మూర్ మహేష్, జెడ్పీటీసి చౌటపల్లి రవి, పార్టీ మండల అధ్యక్షుడు దొనకంటి నర్సయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి గ్రామంలోని ఫంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు గోపిడి రాజేశ్వర్ కూతురు వివాహానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండలధ్యక్షులు రేగుంట దేవేందర్, సర్పంచ్ మారు శంకర్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, నాయకులు బోడా దేవేందర్, ఏనుగు రాజేశ్వర్, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, లోలపు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

'పరీక్షల్లో ఫెయిలైతే మనోధైర్యం కోల్పోవద్దు'

పాస్ అయిన విద్యార్థులకు శుభాకాంక్షలు : జడ్పీటీసీ జగన్

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

పదవ తరగతి, ఇంటర్మీడియట్ పాసైన అభ్యర్థులకు జెడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఫెయిల్ అయిన విద్యార్థులకు మనోధైర్యం కోల్పోవద్దని భరోసా ఇచ్చారు. ఈ టెన్త్ క్లాసు, ఇంటర్మీడియట్ మార్కులు, ఫెయిలు, పాసు అనేది జీవితానికి గీటురాయి కాదని ఇవి జీవితాన్ని నిర్ణయించలేదని ఎందుకంటే చాలామంది పదవ తరగతి ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా జీవితంలో సమర్థవంతంగా ఎదురుకొని అనేక రంగాలలో ఉన్నతమైన స్థానంలో ఉంటూ పదిమందికి ఉపయోగపడేలా పాటుపడుతున్నారని తెలిపారు. రాజకీయ రంగంలో గానీ, వ్యాపారంగంలో గాని చాలా రంగాలలో వారు ప్రగతిని సాధించారని, కాబట్టి వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

పనులు వేగవంతం చేయాలి

- అధికారులను ఆదేశించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- ధాత్రి టౌన్ షిప్‌లో మౌలిక సదుపాయాల కల్పన పనులపై సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ నగరానికి ఆనుకుని మల్లారం వద్ద ప్రభుత్వపరంగా నెలకొల్పిన ధాత్రి టౌన్ షిప్‌లో మౌలిక సదుపాయాల కల్పన పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ధాత్రి టౌన్ షిప్‌లో ప్లాట్ల విక్రయాల కోసం ఇప్పటికే రెండు విడతలుగా వేలం ప్రక్రియలు నిర్వహించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ధాత్రి టౌన్ షిప్‌లో అన్ని రకాల సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే గురువారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్‌లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ధాత్రి టౌన్‌షిప్‌లో పనుల పురోగతిపై సమీక్ష జరిపారు. ఇప్పటికే రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, నీటి వసతి, విద్యుద్దీకరణ, ఎస్.టీ.పీ వంటి మౌలిక సదుపాయాల కల్పన పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా విద్యుద్దీకరణ, నీటి వసతి పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన అందుబాటులోకి వచ్చేలా చూడాలన్నారు. ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణాలను తక్షణమే ప్రారంభించాలన్నారు. సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్‌కు సంబంధించి అధునాతన టెక్నాలజీని అనుసరిస్తూ నిర్మాణం చేపట్టేందుకు వీలుగా సంబంధిత కంపెనీల ప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. వర్షాకాలం సమీపిస్తున్నందున ఇప్పటికే వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని, విరామం లేకుండా పనులు జరిగేలా చూడాలన్నారు. యూజీడీ తదితర పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేసి సకాలంలో పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పనుల పూర్తికి చొరవ చూపాలన్నారు. సమావేశంలో టీఎస్ఐఐసీ ప్రతినిధులు రాందాస్, దినేష్, ట్రాన్స్‌కో ఎస్.ఈ రవీందర్, నిజామాబాద్ రూరల్ తహసీల్దార్ అనిల్, కలెక్టరేట్ పర్యవేక్షకుడు సూర్య వివిధ విభాగాలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

గురుకులం ఉపాధ్యాయుల పరీక్ష కోసం ఉచిత కోచింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ అండ్ ఈబీసీ నిరుద్యోగ అభ్యర్థులకు గురుకులం ఉపాధ్యాయుల పరీక్షకు బీసీ స్టడీ సర్కిల్ నిజామాబాద్ నందు ఉచిత కోచింగ్ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్లైన్లో www.studycircle.cgg.gov.in లేదా www.tsbc-studycircle.cgg.gov.in వెబ్‌సైట్ల ద్వారా 12-05-2023 నుంచి 25-05-2023వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థి సంవత్సర ఆదాయం ఐదు లక్షలకు మించవద్దని సూచించారు. అభ్యర్థుల ఎంపిక విధానం డిగ్రీ/బీఈడీ పరీక్షలో పొందిన మార్కులు, రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ సూచించిన విధంగా రిజర్వేషన్ ప్రకారం ఉంటుందని పేర్కొన్నారు. అమలులో ఉన్న నిబంధనల ప్రకారం స్టైపెండ్, స్టడీ మెటీరియల్ ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలిపిన వెబ్‌సైట్‌లో లభించునని తెలియజేశారు. ఇతర వివరాలకు ఫోన్ నం :08462-241055ను సంప్రదించాలని పేర్కొన్నారు. (లేదా) సుభాష్‌నగర్‌లోని నిర్మల హృదయ కాలేజీకి ఎదురుగా ఓల్డ్ బీఎస్ఎన్ఎల్ బిల్డింగ్ రెండవ అంతస్తులో గల బీసీ స్టడీ సర్కిల్ నందు సంప్రదించాలని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న ఇమ్మడి గోపి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని డోంకల్ గ్రామంలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి తనవంతు సహాయంగా హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులకు రూ.50వేలు విరాళంగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ధర్పల్లి మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి మాట్లాడుతూ.. డోంకల్ గ్రామంలో ఆలయ నిర్మాణం చేపడుతున్నామని దానికోసం సహకారం అందజేయాలని వారు కోరగా వారి కోరిక మేరకు రూ.50వేలు అందజేసినట్టు ఇమ్మడి గోపి వివరించారు. ఆలయాన్ని అన్ని హంగులతో నిర్మించే విధంగా చూడాలని వారిని కోరారు. అడిగిన వెంటనే నిర్మాణానికి సహకరించిన ఇమ్మడి గోపికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న గంగామోహన్ తదితరులు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని రాజారాంనగర్‌లో నివసించే నిరుపేద కుటుంబానికి చెందిన క్షత్రియ విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో ఖాందేష్ శ్రీనిత్ 981, ఖాందేష్ శ్రీకాంత్ 954 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన ఇద్దరు క్షత్రియ విద్యార్థులైన అన్నదమ్ములకు క్షత్రియ సమాజ్ కార్యదర్శి బారడ్ గంగామోహన్ ఆధ్వర్యంలో గురువారం శాలువాతో సన్మానించి నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో సమాజ్ సభ్యులు కిషన్, బాలాజీ, సాతపుతే శ్రీనివాస్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం



నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన తిమ్మజాడ గంగవ్వ (65) ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లింది. గురువారం వరకు ఆమె ఆచూకీ లభించలేదు. గత నాలుగు రోజులుగా గ్రామంలో, బంధువుల వద్ద, ఇతర చోట్ల గంగవ్వ కోసం వెతికినా ఆమె ఆచూకీ దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు ఇందల్‌వాయి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎవరికైనా తెలిస్తే 9390646065/7995133765 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పెన్షనర్ల సమస్యలపై పెన్షన్ అదాలత్

నవతెలంగాణ-కంఠేశ్వర్

పెన్షనర్ల సమస్యలకు సంబంధించిన పెన్షన్ అదాలత్‌ను నేడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తున్నట్లు సహాయక పి.ఎఫ్ కమిషనర్ బి.మధుసూధనాచారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

తిర్మన్‌పల్లిలో ఘనంగా రథోత్సవం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి వేలాది మంది భక్తుల సమక్షంలో ఘనంగా రథోత్సవాన్ని నిర్వహించినట్టు తిర్మన్‌పల్లి ఎంపీటీసీ చింతల దాస్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ధర్పల్లి ప్రభాకర్, శ్రీ వేంకటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతియేటా నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామమే కాకుండా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో పాల్గొంటారని పేర్కొన్నారు.

గంజాయి విక్రయాన్ని అరికట్టాలి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న గంజాయి విక్రయాన్ని అరికట్టాలని కాంగ్రెస్ నాయకులు కోలా వెంకటేష్ అన్నారు. గంజాయిని అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని, అలాగే దానికి బానిసవుతున్న యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి సరియైన మార్గంలో నడిచేలా చూడాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబుకు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్మూర్ పట్టణ, పరిసర ప్రాంతాల్లో గంజాయి మహమ్మారి విజృంభించిదని, భారీగా యువత దానికి అలవాటు పడి బానిసలుగా మారి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, పోలీస్ శాఖ గంజాయి విక్రయదారులపై, వారికి సరఫరా చేస్తున్న వారిపై అలాగే వారికి అండగా నిలుస్తున్న వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మీర్ మాజీద్, మందుల పోశెట్టి, మీసాల రవి, హబీబ్, బట్టు శంకర్, బాలకిషన్, పెద్ద పోశెట్టి, బండ ప్రసాద్, శ్రీకాంత్, దినేష్, అఖిల్, పాషా, వెంకటి, అఫ్రోజ్, ఆదిత్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రెజ్లర్ల నిరసనకు మద్దతుగా ఉద్యమిద్దాం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఢిల్లీలో నిరసన చేస్తున్న మహిళా రెజ్లర్‌లకు మద్దతుగా ఉద్యమిద్దామని హెచ్ఆర్ఎఫ్, పీఓడబ్ల్యు, ఏఐడీడబ్ల్యుఏ నాయకులు డాక్టర్ సరిత పిట్ల, ఆకుల అరుణ, సుజాత అన్నారు. నగరంలోని కోటగల్లిలోని నీలం రామచంద్రయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంతర్జాతీయ పోటీల్లో పతకాలను సాధించిన మహిళ రెజ్లర్లను, రెజ్లింగ్ ఆఫ్ ఇండియా ఫెడరేషన్ అధ్యక్షులు, లోక్‌సభ సభ్యుడు అయినా బ్రిజ్ భూషణ్ సింగ్, లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని గత రెండు వారాలుగా నిరసనలు చేస్తున్న నేపథ్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళా రెజ్లర్లపై ఈనెల 3న రాత్రి పోలీసులు దురుసుగా ప్రవర్తించడం అత్యంత హేయమైన చర్య అని, నిందితులపై చట్టబద్ధంగా చర్య తీసుకోవాల్సింది పోయి, బాధితులపైనే జులూమ్ చేయడం బాధితుల ఫిర్యాదులు పట్టించుకోకపోవడం బీజేపీ ప్రభుత్వం నేరస్తులకు బాసటగా నిలవడం సిగ్గుచేటన్నారు. మహిళా రెజ్లర్లకు ప్రజల నుంచి వస్తున్న మద్దతుకు భయపడి ఎఫ్ఐఆర్ నమోదు చేసి కూడా అతనిపై చర్య తీసుకోకపోవడం ప్రభుత్వం మాటలకు చేతలకు ఉన్న దూరాన్ని చూపిస్తుందని అన్నారు. బేటి బచావో బేటి పడావో అన్నది నేతి బీర సామెత వంటిదే అనిపిస్తుందని తెలిపారు. బాధితుల్లో మైనర్లు ఉండటం వల్ల వెంటనే ఫోక్సో చట్టం కింద నిందితుడిని అరెస్టు చేసి, సమగ్ర దర్యాప్తు చేసి నేరస్తులను కఠినంగా శిక్షించాలన్నారు. రెజ్లర్ల, ఇతర మహిళ క్రీడాకారులకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వ ఉదాసీన వైఖరిని ఖండిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఇలాగే ప్రేక్షక పాత్ర కొనసాగిస్తే దేశంలోని మహిళలు చూస్తూ ఊరుకోరని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ చర్యను ఖండిస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించిందని తెలిపారు. సమావేశంలో హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర నాయకులు గొర్రెపాటి మాధవరావు, సీపీఐ నాయకులు రాజన్న, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అజారుద్దీన్, ఫరూఖ్, ఎంఆర్పీఎస్ నాయకులు సుధాకర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య, ఐఎఫ్‌టీయూ నాయకులు మురళి, శివన్న, మోహన్, రాజు, పీవైఎల్ నాయకులు సాయిరెడ్డి, సత్యం, బీఎల్ఎఫ్ నాయకులు మధు, పీడీఎస్‌యూ నాయకులు జన్నారపు రాజేశ్వర్, దేవిక, పీఓడబ్ల్యు నాయకులు మానస తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

విద్యార్థి జీవితంలో ప్రతి నిమిషం విలువైనదే

- టీయూ అసోసియేట్ ప్రొఫెసర్ ఆంజనేయులు

నవతెలంగాణ-బోధన్

విద్యార్థుల జీవితంలో ప్రతి నిమిషం విలువైనదేనని కావున సమయాన్ని వృథా చేయవద్దని తెలంగాణ యూనివర్సిటీ వాణిజ్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఆంజనేయులు అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని రమాకాంత్ ఫంక్షన్ హాల్‌లో ఉషోదయ డిగ్రీ కళాశాలల 13వ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. విద్యార్థులు నేటి కాలంలో సాంకేతికతతో పాటు ఆర్టిఫిషియల్ నైపుణ్యాలలో ఉన్నతంగా ఎదగాలని సూచించారు. అనంతరం సాందీపని డిగ్రీ కళాశాల అధినేత హరీస్మరణ్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని, చదువుతోపాటు ఇష్టమైన రంగాలలో రాణించాలని సూచించారు. వాగ్దేవి కళాశాల అధినే త సృజన్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు చదువును కష్టంగా భావించకుండా ఇష్టంగా చదివితేనే డిగ్రీ విద్యలో ఉన్నత ఫలితాలు సాధిస్తామన్నారు. అనంతరం ఉషోదయ కళాశాల చైర్మన్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. చిన్న సంస్థగా ప్రారంభమైన ఉషోదయ ఎన్నో కష్టాలను, ఎన్నో అడ్డంకులను అధిగమించి మహాప్రస్థానంగా ఎదిగిందని అన్నారు. నిరంతరం విద్యార్థి అభివృద్ధికి కృషి చేస్తూ వారికి ఉపాధినిచ్చే విద్యను అందిస్తూ ఎందరికో మార్గ దర్శకంగా నిలిచిందని పేర్కొన్నారు. నిరంతర కృషి, సమిష్టి సాధనంతో, అంకిత భావంతో అధ్యాపక బృందం పనిచేయడంతో ప్రతి సంవత్సరం ఉషోదయ విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారని అన్నారు. అనంతరం క్రీడ పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు మెమొంటోలు, మెడల్స్, నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల డైరెక్టర్ దుశ్యంత్, సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, శైలజ, ఆనంద్ రెడ్డి పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న ప్రొఫెసర్

జీపీ కార్యదర్శుల సమ్మెకు పలువురు మద్దతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/నవీపేట్

గత 14 రోజులుగా తమను రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్న సమ్మెకు సీపీఐ (ఎం.ఎల్) ప్రజా పంథా నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ దీక్షా శిబిరానికి వెళ్లి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికే 4 సంవత్సరాల ప్రోహిబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయకుండా కాలయాపన చేయడం సరైనది కాదన్నారు. వారి సమస్యను పరిష్కరించకుండా సమ్మె విరమించాలని ప్రభుత్వం బెదిరించడం దౌర్జన్యమే అవుతుందన్నారు. వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి వి.ప్రభాకర్ మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె వల్ల గ్రామాల్లో పాలన కుంటుపడిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. వెంటనే జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో చర్చించి, వారిని విధుల్లో పాల్గొనేలా సమ్మెను పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. జేపీఎస్‌లను తక్షణమే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఎం.వెంకన్న, జిల్లా నాయకులు ఎం.నరేందర్, ఎస్.సురేష్, నాయకులు బాబన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నవీపేట్ : జీపీ కారోబార్ సమ్మెకు ఎంఎస్పీ మద్దతు

జీపీ కారోబార్ సమ్మెకు ఎంఎస్పీ మద్దతు

నవీపేట్ : మండల కేంద్రంలో పంచాయతీ కారోబార్, సిబ్బంది నిర్వహిస్తున్న సమ్మెకు మహాజన సోషలిస్టు పార్టీ బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ నియోజకవర్గ నాయకులు మనికోల్ల గంగాధర్ మాట్లాడుతూ.. పంచాయతీ కారోబార్లకు రూ.21,500, సఫాయి కార్మికులకు వేతనం రూ.18,500 చెల్లించాలని అన్నారు. న్యాయమైన డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యంఎస్పీ బోధన్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు గుర్రాల మోహన్ పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద గల గాయత్రి బ్యాంకు యందు గురువారం ఎడ్డండి లావణ్యకు లక్ష రూపాయల ప్రమాద బీమా చెక్కును స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు, బ్రాంచ్ మేనేజర్ శ్రీరామోజి లింబాద్రి చేతుల మీదుగా అందజేశారు. ఆమె భర్త ఎడ్డండి నరేష్ మరణించగా ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా స్టేషన్ హౌస్ ఆఫీసర్ మాట్లాడుతూ.. మధ్యతరగతి, వ్యాపార, ఉద్యోగ వర్గ ప్రజలకు రుణాలను ఇస్తుండడం అభినందనీయమని, నామమాత్రపు చార్జీలతో, ఒక లక్ష రూపాయల ప్రమాద బీమా ద్వారా ఖాతాదారుల కుటుంబాలకు తమ వంతు బాధ్యత నిర్వర్తించటం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థికి సన్మానించిన ఎంఈఓ



విద్యార్థిని సన్మానిస్తున్న ఎంఈవో

నవతెలంగాణ-బోధన్

సాలూరా మండలంలోని హున్సా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సిరిసే ప్రణవి పదో తరగతి పరీక్షల్లో బోధన్ మండలంలోనే 10/10 జీపీఏ సాధించిన ఒకే ఒక విద్యార్థినిగా చరిత్ర సృష్టించింది. దాంతో గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బోధన్ ఎంఈఓ నాగనాథ్ విద్యార్థినికి ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం నగేష్, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-భీంగల్

బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాలలో పల్లికొండ పాఠశాలకు చెందిన విద్యార్థులు అమూల్య 10/10, ప్రవీణ 10/10, అలాగే హర్షిణి, సాయితేజ 9.8, సాయివల్లబ్, హసినిలు 9.7 గ్రేడ్ సాధించడంతో ప్రధానోపాధ్యాయుడు హరినాథ్, సర్పంచ్ యమున, ఉపసర్పంచ్ ప్రశాంత్, యంపీటీసీ కృష్ణ గురువారం పాఠశాలలో సన్మానించారు. కార్యమంలో వీడీసీ సభ్యులు, ఎస్ఎంసీ చైర్మన్ తదితరులున్నారు.

రిపోర్టర్‌ను పరామర్శించిన కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

నవతెలంగాణ ఆర్మూర్ విలేకరి తిరుపతికి ప్రమాదవశాత్తు గాయపడటంతో ప్రవాస భారతీయుల హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు గురువారం స్వయంగా ఆయన ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ప్రమాద ఘటనపై ఆరా తీశారు. తిరుపతి కుల వృత్తితో పాటు రిపోర్టర్‌గా సమస్యలపై వార్తలు, స్టోరీలు రాయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంట గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మినీట్యాంక్ ప్రారంభం

నవతెలంగాణ-తాడ్వాయి

సంతాయిపేట్ గ్రామంలో ఓ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను, భీమేశ్వర ఆలయం వద్ద నిర్మించిన డైవర్షన్ వాల్‌ను జిల్లా భూగర్భజల శాఖ పీడీ సతీశ్‌యాదవ్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా మేనేజర్ పులగాం రాజు, సర్పంచ్ బాగ్యా లక్ష్మి శ్రీనివాస్, భీమేశ్వరా ఆలయ కమిటీ చైర్మన్ మహిపాల్ రెడ్డి, డీపీవో వీరేశం, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మినీ వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

అనుదినం జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని మేడిపల్లి సర్పంచ్ మల్లెబోయిన నారాయణ సోదరుడు బిఆర్ఎస్ పార్టీ కార్యకర్త మల్లెబోయిన సాయిలు గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్ గురువారం వారి కుటుంబీలను పరామర్శిం చారు. పార్థివదేహంపై పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి, నివాళు లర్పించారు. సోదరుడి మరణానికి కార ణాలను సర్పంచ్‌ను అడిగి తెలుసుకున్నారు. వారిని ఓదార్చి మనో ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి అండగా ఉంటానని హామీ ఇచ్చిరు. అనంతరం అత్యక్రియల్లో పాల్గొని పాడేమోశారు.



చదువుకు పేదరికం అడ్డుకాదు

- నిరూపించిన అక్కాచెల్లెండ్లు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు ఇంటర్మీడియట్ విద్యార్థులు. నిజామాబాద్ రూరల్ మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన కౌలాస్ శ్రేయ, కౌలాస్ శరణ్య అక్కాచెల్లెండ్లు. హైదరాబాద్ లోని మియాపూర్ ఎన్ఆర్ఐ కాలేజీలో వీరిద్దరూ చదువుకుంటున్నారు. ఇంటర్‌లో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించారు. కౌలస్ శ్రేయ బైపీసీ సెకండియర్‌లో 1000/990 మార్కులు సాధించగా.. కౌలాస్ శరణ్య ఎంపీసీ ఫస్టియర్‌లో 470/466మార్కులు సాధించింది. ఈ సందర్భంగా వీరి తల్లిదండ్రులు మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి తమ పిల్లలు కష్టపడి చదివేవారని, ఉన్నదాంట్లో సర్దుకుని ముందుకు వెళ్ళేవారని, తమ పిల్లలు చదువులో మొదటి స్థానంలో ఉండటం చాలా గర్వకారణంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



శ్రేయ, శరణ్య

విద్యార్థులను సన్మానించిన నరేంద్ర పాఠశాల యాజమాన్యం




విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు, యాజమాన్యం


నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి నరేంద్ర పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ జీపీఏ కనపరిచిన విద్యార్థిని విద్యార్థులను గురువారం సన్మానించారు. 10 జీపీఏ సాధించిన నవదుర్గ, స్ఫూర్తి, 9.8 జీపీఏ సాధించిన హిమబిందు, లతిగ, అనూష, రిశ్విత్‌రెడ్డిలను పాఠశాల యజమాన్యం వైస్ చైర్మన్ బద్దం లింగారెడ్డి, డైరెక్టర్ అరవిందు శాలువా కప్పి పుష్పగుచ్చంతో సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం మాలెపు చంద్రయ్య, కోడి శ్రీనివాస్, పురుషోత్తం, రాములు, అజయ్, వ్యాయామ ఉపాధ్యాయుడు హరీష్, సంతోష, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు మారుపేరు 'భార్గవి విద్యానికేతన్'



సాయి వర్షిని 9.5



అర్జున్ 9.5

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని భార్గవి విద్యానికేతన్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ప్రగతి పట్వారి గురువారం తెలిపారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తూ భార్గవి పాఠశాలలో చదివిన విద్యార్థిని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగినట్టు ఆమె తెలిపారు. అర్జున్ 9.5, సాయివర్షిణి 9.5 పొందినట్టు తెలిపారు.

మైనారిటీ గురుకులంలో అత్యుత్తమ ఫలితాలు



విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నాగారంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు అత్యుత్తమ స్థాయిలో ఫలితాలు సాధించి విజయకేతనం ఎగరేసిందని పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. కిరణ్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని మైనారిటీ, ఇతర సంక్షేమ విద్యా సంస్థ లలో కెల్లా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు. ఉత్తమ ఫలితాల సాధనలో సహకరించిన జిల్లాస్థాయి అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. పదవ తరగతి ఫలితాలలో బార్గవ్ 9.7, అవేస్ 9.3, ఫైజాన్ 9.3, రోహిత్ 9,0, వసీమ్ 90. ఆరుణ్ 9.0 గ్రేడ్ లు సాధించారు. ముగ్గురు 8 గ్రేడ్ పైన మార్కులు, ఏనిమిది మంది 7 గ్రేడ్ పైన మార్కులు, ఏనిమిది మంది అగ్రేడ్ పైన మార్కులు సాధించారని అన్నారు. మొత్తం 27 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరవగా.. అందరూ పాస్ అయినట్టు తెలిపారు. నిజామాబాద్ పరిసర ప్రాంత మైనారిటీ, మైనారిటీ యెతర విద్యార్థులు ఈ పాఠశాలలో ప్రవేశం పొంది ఉత్తమ విద్యను అభ్యసించాలని కోరారు.

పిల్లలు చూసుకోకుంటే ఫిర్యాదు చేయండి

- వయోవృద్ధుల పోషణ, ఫిర్యాదుల వెబ్ పోర్టల్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- ఫిర్యాదు చేసేందుకు ఇబ్బందులుంటే 14567కు డయల్ చేయొచ్చని సూచన



పోర్టల్ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-తాడ్వాయి(కామారెడ్డి)

నిరాదరణకు గురైన తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చూసుకోని పిల్లలపై ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. తెలంగాణ వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ డైరెక్టర్ శైలజ సూచనల మేరకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ , అడిషినల్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే వయోవృద్ధుల పోషణ ఫిర్యాదుల వెబ్ పోర్టల్ ను గురువారం ప్రారంభించారు. తల్లిదండ్రుల సంరక్షణ చూసుకోని పిల్లలపై ఆన్‌లైన్‌లో సినియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసెస్ మోనిటరింగ్ సిస్టం వెబ్ పోర్టల్ tsseniorcitizens.cgg.gov.inలో ఫిర్యాదు చేయాలని చెప్పారు. వయోవృద్ధులు మొబైల్ ఫోన్, ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా ఈ వెబ్ పోర్టల్ లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ కలెక్టర్‌కు ఫిర్యాదులు నమోదు చేసుకునే వీలుందన్నారు. ఈ వెబ్ పోర్టల్‌లో నమోదైన ఫిర్యాదులు ఈ మోడలింగ్ సిస్టం ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని చెప్పారు. వయో వృద్దులు పిర్యాదులు నమోదు చేసే విధానం లో ఇబ్బంది ఉంటే వయోవృద్ధుల హెల్ప్ లైన్ 14567ని సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారిణి పి.రమ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి రమ్య, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ నరేష్ పాల్గొన్నారు.

ధరణి టౌన్‌షిప్‌లో వసతులు కల్పించాలి

ధరణి టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల కల్పన కోసం ప్రతిపాదనలను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. కామారెడ్డి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ధరణి టౌన్షిప్‌లో మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీటీ రోడ్లు, మురుగు కాలువలు, విద్యుత్ సౌకర్యం వంటి సౌకర్యాల కోసం ప్రతిపాదనలను అధికారులు తయారుచేసి ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేష్ దోత్రే, టిపిఓ గిరిధర్, ఆర్ అండ్ బి డిఈ శ్రీనివాస్, మున్సిపాలిటీ డిఈ వాసుదేవరెడ్డి, రాజీవ్ స్వగృహ ఏజీఎం సత్యనారాయణ, పర్యవేక్షకుడు సాయి భుజంగరావు, తహసిల్దార్ వెంకట్ రావు , అధికారులు పాల్గొన్నారు.

కార్యదర్శుల సమ్మెకు ఆపరేటర్ల మద్దతు



ఆర్థిక సాయం అందజేస్తున్న ఆపరేటర్‌లు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ డివిజన్ పరిధిలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె నేటితో 14వ రోజుకు చేరుకుంది. జూనియర్ పంచాయతీ కార్యదర్శు లు తమ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమ్మె కొనసాగిస్తు న్నమన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేస్తామని చేయకపోవడంతో మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల జూనియర్ పంచా యతీ కార్యదర్శులు బాన్సువాడ డివిజన్ కార్యాలయం ఆవరణలో సమ్మెను కొనసాగిస్తున్నారు.

ఈ సందర్భంగా గురువారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మద్దతుగా గ్రామపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు పంచాయతీ కార్యదర్శులు చేస్తున్న సమ్మెకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన జూనియర్ పంచాయతీ కార్యదర్శులతో పాటు సమ్మెలో కూర్చొని జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు రెండు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.

జీవాలకు టీకాలు వేయించుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలో మేకలు, గొర్రెలకు టీకాల కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు గురువారం ప్రారంభించారు. జిల్లా పశు సంవర్ధక, పశు వైద్య జిల్లా అధికారి సింహారావుతో మాట్లాడి గొర్రెలకు, జీవలకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జీవల పెంపకం దారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సూచన మేరకు గొర్రెలు ఆరోగ్యంగా జీవించే విధంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, పశువైద్యాధికారి శివకుమార్, రమేష్, నేతుల మల్లేష్ యాదవ్ పులబోయిన శంకర్, నాగ మల్లయ్య, లింగం, లింబద్రి, బిచ్చమొల్ల లింగం, మల్లేష్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ధాన్యం అన్‌లోడింగ్ ఆగొద్దు

- జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి
- ధాన్యం నిల్వల కోసం అదనపు గోడౌన్లు గుర్తించాలి
- ధాన్యం కొనుగోలు పురోగతిపై మంత్రి వేముల సమీక్ష
- క్షేత్రస్థాయిలో పరిస్థితిపై సొసైటీల చైర్మన్‌లతో ఫోన్‌లో ఆరా



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలను దిగుమతి చేసుకోవడంలో జాప్యానికి తావులేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రోడ్లు - భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతుల నుండి కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని వెంటదివెంట తరలించ డంతో పాటు, తక్షణమే మిల్లుల వద్ద అన్ లోడింగ్ జరిగేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ జరిపేందుకు వీలుగా ప్రత్యేకంగా అధికారులను నియమించాలని సూచించారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్స్ ని 60 క్లస్టర్ లుగా విభజించాలని, వాటికి 60 మంది జిల్లా స్థాయి అధికారులను నియమించి ప్రతి రోజు ధాన్యం అన్లోడ్ అయ్యేలా పర్యవేక్షించాలన్నారు.

గురువారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో ధాన్యం సేకరణ స్థితిగతులపై సమీక్షించారు. ప్రధానంగా రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలతో కూడిన వాహనాలు ఎక్కువ సమయం పాటు నిలిచి ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గుండారం లోని జైగణేష్ ప్యాడీ ప్రాసెస్సింగ్ ఇండస్ట్రీస్, శ్రీ ధనలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీ కృష్ణ ఆగ్రో ఇండస్ట్రీస్, శ్రీనగర్ లోని శ్రీలక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్, ఖానాపూర్ లోని శ్రీ పాండురంగ రైస్ మిల్, కాలూర్ లోని శ్రీ అయ్యప్ప ఇండస్ట్రీస్, బర్దిపూర్ లోని శ్రీ చక్ర ఇండస్ట్రీస్, బోర్గం లోని శ్రీ లక్ష్మీనారాయణ రైస్ ట్రేడర్స్ లలో ఎక్కువ మొత్తంలో ధాన్యం అన్ లోడింగ్ కాలేదని, ఈ రైస్ మిల్లులను సందర్శించి పరిస్థితిని క్షేత్రస్థాయిలో సమీక్షించాలని ఆర్డీఓ లను ఆదేశించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకునేందుకు వీలుగా అవసరమైతే ఎక్కువ మొత్తంలో గోడౌన్లను గుర్తించాలని, సరిపడా హమాలీలు అందుబాటులో ఉండేలా ప్రణాళికా బద్ధంగా వ్యవహరించాలని అధికా రులను ఆదేశించారు.

జిల్లా వ్యాప్తంగా మొత్తం 218 రైస్ మిల్లులకు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం పంపిస్తు న్నామని, వీటిలో 123 రా రైస్ మిల్లులు ఉండగా, మరో 95 బాయిల్డ్ రైస్ మిల్లులకు ఇటీవల కురిసిన ధాన్యాన్ని పంపుతున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మంత్రి దృష్టికి తెచ్చారు.

అయితే గత సంవత్సరం 6.35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయగా, ఈసారి 7 లక్షల మెట్రిక్ టన్నుల పైచిలుకు ధాన్యం సేకరించాల్సి ఉన్నందున కొనుగోలు ప్రక్రియలో ఎక్కడ కూడా జాప్యం జరుగకుండా పకడ్బందీగా వ్యవహరించాలని మంత్రి హితవు పలికారు. ప్రధానంగా రైస్ మిల్లుల వద్ద ధాన్యం నిల్వలు వెంటదివెంట అన్ లోడ్ జరగాలన్నారు. ఈ మేరకు ఒక్కో రైస్ మిల్లు వద్ద వాహనాలు ఎంత సమయం పాటు నిలిచి ఉంటున్నాయన్నది రోజువారీగా గమనిస్తూ, అన్ లోడింగ్లో తీవ్ర జాప్యం జరుగుతున్న చోట అందుకు గల కారణాలను అన్వేషిస్తూ పరిస్థితిని చక్కదిద్దాలని సూచించారు. ధాన్యం రవాణా కోసం వినియోగిస్తున్న 800 లారీలు ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమై ఉన్నాయా లేదా అన్నది మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ల ద్వారా పరిశీలన జరిపించాలని డీటీసీని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు ఇబ్బందులకు గురికాకూడదని, నిర్ణీత గడువు లోపు ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా పూర్తయ్యేందుకు అధికారులందరూ ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

వాస్తవ పరిస్థితిపై ఫోన్ చేసి వాకబు

ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సొసైటీల చైర్మన్లకు, రైస్ మిల్లర్లకు, ట్రాన్స్ పోర్ట్ వాహనాల కాంట్రాక్టర్ లకు అధికారుల సమక్షంలోనే ఫోన్ ద్వారా సంప్రదించి క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితి గురించి వాకబు చేశారు. కొనుగోలు కేంద్రాల ద్వారా కేటాయించిన ధాన్యాన్ని నిలువ చేసేందుకు అదనంగా గిడ్డంగుల అవసరం ఉన్నదని రైస్ మిల్లర్లు తెలుపగా, ఈ మేరకు గోడౌన్లను తక్షణమే గుర్తించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈసారి పెద్ద మొత్తంలో ధాన్యం దిగుమతులు కొనుగోలు కేంద్రాలకు వస్తున్నందున వెంటదివెంట అన్ లోడింగ్ చేసుకునేలా సన్నద్ధమై ఉండాలని, నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ కొనసాగేందుకు అన్ని విధాలుగా సహకరించాలని రైస్ మిల్లర్లకు హితవు పలికారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, డీ.ఎస్.ఓ చంద్రప్రకాష్, మెప్మా పీ.డీ రాములు, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ జగదీశ్, డీ సి ఓ సింహాచలం, డీ టీ సి వెంకటరమణ, ఆర్డీఓలు రవి, రాజేశ్వర్, శ్రీనివాస్, వ్యవసాయ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి వేముల

భార్య కాపురానికి రావటం లేదని భర్త ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-రామారెడ్డి

భార్య కాపురానికి రావటం లేదని మనస్థాపం చెంది, మండలంలోని మద్దికుంట, రెడ్డిపేట్ గ్రామాల పెద్ద చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం వెలుగు చూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సైలాన్ బాబా కాలనీకి చెందిన పసులేటి శివకుమార్(37)కు గత పది సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా, జగదేవ్‌పూర్ గ్రామానికి చెందిన లావణ్యతో వివాహం జరిగింది. ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే మూడేండ్ల క్రితం భార్యభర్తల మధ్య గొడవలు జరగడంతో రెండు సంవత్సరాల క్రితం లావణ్య ఇద్దరు కుమారులను తీసుకొని తల్లి గారి ఇంటికి వెళ్లిపోయింది. చాలాసార్లు కాపురానికి రావాలని కోరినా, తీసుకువచ్చేందుకు వెళ్లినా రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైండు. దీంతో మంగళవారం సాయంత్రం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే గురువారం చెరువులో మృతదేహం తేలడంతో స్థానికుల సమాచారం మేరకు మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై అనిల్ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్



పేకాట స్థావరం వద్ద నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని ముద్దెల్లి గ్రామంలో పేకాట ఆడుతూ పట్టు బడిన తొమ్మిది మంది వ్యక్తుల పైన కేసు నమోదు చేసి వారి వద్ద నుండి పేక ముక్కలు, రూ.8160 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ డి. సుధాకర్ తెలిపారు. గురువారం వివరాలు వెల్లడించారు. తొమ్మిది మంది కలిసి ముధోలి గ్రామ శివారులోని చెరువు పక్కన గల మర్రి వద్ద పేకాట ఆడుతున్న సమాచారం రావడంతో ఎసై సుధాకర్, కానిస్టేబుళ్ల యాదగిరి, రమేష్, నవీన్ సిబ్బంది విఠల్ రావ్ కలిసి అక్కడికి వెళ్లి వారిని పట్టుకున్నట్టు తెలిపారు.

పేకాట, గంజాయి, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పొడొద్దని, ఎవరు చేసినా ఉపేక్షించబోమని ఎస్సై తెలిపారు. మండలంలో ఎక్కడైనా, ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే డయల్ 100 ద్వారా గాని, 8712686165 నెంబర్ ద్వారా గాని గాంధారి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఆటోను ఢీకొన్న కారు

ఆరుగురికి గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

నవతెలంగాణ-సదాశివనగర్

ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలు అయిన ఘటన మండలంలోని జాతీయ రహదారి 44పై గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండలం పెద్ద పోతంగల్ నుండి ఒక ఆటోలో ఆటోకు సంబంధించిన వారిద్దరు, ప్యాసింజర్లు నలుగురు అందులో ఒక మొగులవ్వ (55) చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తున్నారు. వెనుక నుంచి వచ్చిన కారు ఆటోను ఢీకొనడంతో అందులో ఉన్న ఆరుగురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులకు చికిత్స నిమిత్తం వారిని హుటాహుటిన కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. షేక్ సలాం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు.

సీఎం కప్ నిర్వహణపై సమీక్ష సమావేశం

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన సీఎం కప్ నిర్వహణపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 16వ తేదీ నుండి మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో నిర్వహించ తలపెట్టిన పోటీల్లో కోకో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్, ఫుట్ బాల్ పోటీలను మూడు రోజులు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 15 నుండి 36 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా స్థాయిలో, జిల్లా స్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాజిద్ అలీ, డిప్యూటీ ఎమ్మార్వో సవై సింగ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎంపీఓ రామకృష్ణ, ఏఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

నవతెలంగాణ-మోపాల్

జిల్లాలో రెండు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలుచోట్ల ద్విచక్ర వాహన చోరీలు జరగడంతో నిజామాబాద్ ఏసీపీ కిరణ్ కుమార్ ఆదేశాలతో సౌత్ రూరల్ సీఐ సురేందర్‌రెడ్డి సూచనలపై మోపాల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.మహేష్, పోలీస్ సిబ్బంది బృందంగా ఏర్పడి ఆ నేరస్తుల గురించి సమాచార సేకరణలో ఉండగా మోపాల్ శివారులో గల ప్రెసిడెన్సీ స్కూల్ దగ్గర తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో దొంగలను పట్టుకున్నారు. అందులో ఏ 1గా షేక్ అఫ్రోజ్, ఏ 2గా మొహమ్మద్ ఇనాయత్ అలీ ఇద్దరిని గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసును చేధించడంలో ముఖ్యపాత్ర వహించిన మోపాల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జి.మహేష్, పోలీస్‌స్టేషన్ సిబ్బంది, కానిస్టేబుల్ మల్లేష్‌ను సీఐ సురేందర్‌రెడ్డి అభినందించారు.

మహిళ సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట
- ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా
- న్యాక్ శిక్షణ కేంద్రంలో ట్రైనింగ్ పొందిన మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ

మహిళ సాధికారత ప్రభుత్వ ధ్యేయమని, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. గురువారం నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల న్యాక్ శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్‌లో శిక్షణ పొందిన 133 మంది మహిళలకు క్యాంపు కార్యాలయంలో కుట్టు మిషన్లు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో మహిళ సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని వివరించారు. మహిళలు ఆర్థికంగా వృద్ధి సాధించుట కొరకు ఉపాధి శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, బీఆర్ఎస్ నాయకులు సిర్ప రాజు, కార్పొరేటర్‌లు వెల్డింగ్ నారాయణ, శివ చరణ్, రాజేంద్రప్రసాద్, ముచుకుర్ నవీన్, ప్యాట సంతోష్, న్యాక్ సహాయ సంచాలకులు ప్రభాకర్, ఇంస్ట్రక్టర్‌లు కవిత, సాయికృష్ణ, లక్ష్మీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లు సర్టిఫికెట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

అర్సపల్లి వైకుంఠధామం పనులను పరిశీలించిన ఎమ్మెల్యే..

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అర్సపల్లి వైకుంఠ ధామం పనులను గురువారం పరిశీలించారు. పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, కాంట్రాక్టర్‌లకు తెలియజేశారు. పనులలో నాణ్యత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

ఫంక్షన్ హాల్ ప్రారంభం..

నిజామాబాద్ సిటీ : నిజామాబాద్ నగరంలోని నగర ప్రజలకు మరింత చేరువ అయ్యే విధంగా ఆధునిత సౌకర్యాలతో ఏర్పాటు చేసిన అల్ నూరా ప్యాలెస్ నూతన ఫంక్షన్ హాల్‌ను ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర ప్రజలు ఫంక్షన్ చేసుకోవడం అనువుగా సౌకర్యవంతంగా విశాలంగా ఉండటంతో పాటు వచ్చిన అతిథులకు సౌలభ్యంగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో ఆతిఫ్ బిన్, మహమ్మద్, మహమ్మద్ గౌస్, ఇమ్రాన్ బిన్ మోసిన్, హెూమర్ బిన్ తలాబ్, మహమ్మద్ ఆరిఫ్, బజార్ బిన్ ఆరిఫ్, ఆహ్మద్‌పుర కాలనీవాసులు పాల్గొన్నారు.

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీ..

- ఆ ప్రభుత్వాన్ని ఐక్యంగా ప్రతిఘటించాలి

: కేవీపీఎస్ పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని ఐక్యంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉందని కేవీపీఎస్ నాయకులు తెలిపారు. గురువారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొండ గంగాధర్ మాట్లాడుతూ.. నేడు భారత రాజ్యాంగాన్ని మారుస్తానని ఆర్ఎస్ఎస్, భజరంగ్ సంస్థలు మనువాద సిద్ధాంతాన్ని ముందుకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. మనువాద భావజాలను భారతదేశంలో ఉన్నటువంటి మానవులను సమానంగా చూడకుండా మానవుల కంటే పశు సంపదనే ముందుకు మానవులను పశువుల కంటే హీనంగా చూస్తుందని తెలిపారు. భారత రాజ్యాంగం మానవులంతా సమానమని చట్టం ముందు అందరూ సమానులేనని, నిచ్చెన మెట్ల సమాజాన్ని కూలదోయడానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని మారుస్తానని కొత్త ప్రాచీన రాజ్యాంగం కొరకు ప్రయత్నాలు కొనసాగడాన్ని కార్మికవర్గం అన్ని వర్గాల వారు ఐకమత్యంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఐక్యంగా ఉండి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు సుమన్, భూమన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత సాధించేవరకూ
నిరవధిక సమ్మె


ముప్కాల్ : కొనసాగిస్తున్న సమ్మె

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతి పథం (ఐకేపీ) కార్యాలయం ఎదుట ఆయా గ్రామాల వీవోఏలు తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని చేపట్టిన నిరవధిక సమ్మె గురువారానికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడారు. ఐకేపీ ఆధ్వర్యంలో గ్రామ వీవోఏలు క్షేత్రస్థాయిలో మహిళా సంఘాల అభ్యున్నతి కోసం తాము నిరంతరం పాటుపడుతున్నప్పటికీ ప్రభుత్వం తమ సమస్యల డిమాండ్లను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించే ప్రతి కార్యక్రమంలో తమ వంతుగా పాల్గొంటున్నప్పటికీ వీవోఏల పట్ల తెలంగాణ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పోచయ్య, సుదర్శన్, యూసుఫ్, రేణుక, సరస్వతి, కుమ్మరి పుష్ప, శోభ, సంధ్య, నసీరాబాను, సవిత, లత, మంజుల, స్వప్న, గౌతమి, రాధా, సుజాత, అనురాధ, అనిత, గాయత్రిలతో పాటు ఆయా గ్రామాల వీవోఏలు సమ్మెలో కూర్చున్నారు.

వీవోఏలతో బీజేపీ నాయకుల సహపంక్తి భోజనం..

నవీపేట్ : మండల కేంద్రంలో వీవోఏలు చేపట్టిన సమ్మెను బీజేపీ నాయకులు సందర్శించి గురువారం వారితో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామాల్లో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న మహిళ వీవోఏలపై కనీస కనికరం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వ రాజకీయ సమావేశాలకు ఉపయోగించుకునే నాయకులు 18 రోజుకులుగా సమ్మె చేస్తుంటే గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. వెంటనే న్యాయమైన వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పుట్టా శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్, గణేష్, రాజేందర్‌గౌడ్, రాము వీవోఏలు పాల్గొన్నారు.

వీవోఏల సమ్మెకు సంఘీభావం తెలిపిన సునీల్‌రెడ్డి..

ముప్కాల్ : వీవోఏలు తమ డిమాండ్ల సాధనకై చేస్తున్న సమ్మె 18వ రోజుకు చేరుకుంది. గురువారం ఉదయం ముప్కాల్ మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయం ముందు సమ్మెను కొనసాగించారు. వీవోఏల సమ్మెకు ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి శాఖ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్న వీవోఏలను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరైంది కాదన్నారు. వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, నెలకు రూ.18వేల వేతనం, ఉద్యోగ భద్రత కల్పిస్తూ రూ.10లక్షల ఆరోగ్య, సాధారణ బీమా కల్పించాలని అన్నారు. వీవోఏల మండలాధ్యక్షురాలు అరుణ తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ సునీల్‌కుమార్‌రెడ్డి ముందు తమ సమస్యలను వెలిబుచ్చారు. కార్యక్రమంలో సునీల్ యువసేన నాయకులు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల నిరవధిక సమ్మె..

కమ్మర్‌పల్లి : తమ డిమాండ్ల పరిష్కారం కోసం మండల కేంద్రంలో వీవోఏలు చేస్తున్న నిరవధిక సమ్మె గురువారంతో 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ.. వీవోఏలను సెర్ప్ సిబ్బందిగా గుర్తించాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐకేపీ వీవోఏలకు నెలకు కనీస వేతనం రూ.18వేలు చెల్లిస్తూ, నేరుగా డీఆర్‌డీఏ ఖాతా నుంచి వీవోఏల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ.10 లక్షల సాధారణ బీమా వర్తింపచేసి ఆదుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలన్నారు. సెర్ప్ సిబ్బందిగా గుర్తిస్తూ ఐడీ కార్డులు అందజేయాలన్నారు.

18వ రోజుకు వీవోఏల సమ్మె..

బోధన్ : తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న వీవోఏల సమ్మె గురువారం నాటికి 18వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా వీఓఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీసం రూ.18 వేలు చెల్లించాలని, ఐడీ కార్డులు జారీ చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, డ్రెస్ కోడ్ జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెలో నాయకులు వెంకటేష్, భూమయ్య, రమేష్, సునీత, రాధా, పంచశీల, కృష్ణవేణి, స్వప్న, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నిరుద్యోగ యువత కోసమే
హైదరాబాద్ యూత్ డిక్లరేషన్

- టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ నిరుద్యోగ యువత కోసమే హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గురువారం కాంగ్రెస్ భవన్ నందు పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, రూరల్ ఇంచార్జ్ భూపతిరెడ్డితో కలిసి హైదరాబాదులో యువ సంఘర్షణ సభలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన యూత్ డిక్లరేషన్ విషయంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నిదానంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నామని, కానీ కేవలం ఇప్పుడు కేసీఆర్ కుటుంబానికి నీళ్లు, నిధులు, నియామకాలు అన్ని ఉన్నాయని ఆయన అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో దొంగ పాలన నడుస్తుందని, ప్రజాస్వామ్యం అంటే లెక్కలేదని, దళితులను ముఖ్యమంత్రి చేస్తానని చెప్పిన కేసీఆర్ తెలంగాణ వచ్చిన తర్వాత 18శాతమున్న దళితులకు ఒక్క మంత్రి పదవి మాత్రమే ఇచ్చాడని, ఒక పర్సెంట్ కూడా లేని కేసీఆర్ వర్గానికి చెందిన వారికి నాలుగు మంత్రి పదవులు ఉన్నాయని, ప్రజల సొమ్ము ప్రజలకు చెందే విధంగా కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ చేసిందని, గతంలో వరంగల్లులో రైతు డిక్లరేషన్ చేశామని, కాంగ్రెస్ పార్టీ చెప్పింది చేసి తీరుతుందని అన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ తొమ్మిదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నాడని, కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి సామాన్యుల నుండి విరుస్తుందని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే చదువుకున్న యువకులకు ఉద్యోగాలు వస్తాయని తెలంగాణ తెచ్చుకుంటే ఇప్పుడు యువకులు అందరూ నిరుద్యోగులుగా మిగిలిపోయారని, నిరుద్యోగుల కోసం కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ యువ సంఘర్షణ సభలో యూత్ డిక్లరేషన్ చేసిందని అందులో పలు అంశాలను ఆయన వివరించారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో ప్రాణాలర్పించిన యువతీ, యువకులను ఉద్యమ అమరవీరులుగా గుర్తించి, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, తల్లి/తండ్రి/భార్యకు రూ.25000ల నెలవారీ అమరవీరుల గౌరవ పెన్షన్, ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన కేసులను ఎత్తివేయడంతో పాటు, జూన్ 2న వారికి తెలంగాణ ఉద్యమకారులుగా ప్రభుత్వ గుర్తింపు కార్డు అందజేత, మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, మొదటి ఏడాదిలోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, ప్రతీ ఏడాది జూన్ 2 నాటికి అన్ని శాఖల్లోని ఖాళీలతో జాబ్ క్యాలెండర్ ప్రకటించి, సెప్టెంబర్ 17 లోపు నియామకాల పూర్తి, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే వరకు ప్రతీ నెలా రూ.4000 నిరుద్యోగ భృతి చెల్లింపు, ప్రత్యేక చట్టంతో టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి యూపీఎస్సీ తరహాలో పునరుద్ధరణ చేస్తామన్నారు. కాంగ్రెస్ హయాంలో నిరుద్యోగ రహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు సెంట్రలైజ్డ్ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ పోర్టలు ఏర్పాటు చేసి, 7జోన్లలో ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌లను, ప్రతి జిల్లాలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నెలకొల్పడం, ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రైవేట్ కంపెనీల్లో తెలంగాణ యువతకు 75శాతం రిజర్వేషన్ కల్పన, విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు యూత్ కమీషన్‌ను ఏర్పాటు చేసి, రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణ సదుపాయ కల్పిస్తామన్నారు. అలాగే మహిళలకు 500 రూపాయలకే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేష్‌కుమార్‌గౌడ్

జీపీ కార్మికుల సమ్మెతో
ట్రాక్టర్‌లో చెత్త తరలించిన సర్పంచ్ భర్త


చెత్తతరలిస్తున్న సర్పంచ్ భర్త

నవతెలంగాణ-నవీపేట్

గ్రామపంచాయతీ కార్మికులు గత ఆరు రోజుల నుంచి సమ్మె నిర్వహిస్తుండటంతో సర్పంచ్ భర్త ట్రాక్టర్లో డ్రైవింగ్ చేస్తూ చెత్తను తరలిస్తున్న ఘటన మండలంలోని నందిగామ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని నందిగామ గ్రామంలో సఫాయి కార్మికులు సమ్మె చేస్తున్నారు. గ్రామంలో రోడ్లపై చెత్తదర్శనం ఇవ్వడంతో స్వయంగా సర్పంచ్ భర్త కిషన్‌రావు బుధవారం స్వయంగా ట్రాక్టర్ డ్రైవింగ్ చేస్తూ చెత్తను తరలిస్తూ తనపై ప్రజలు పెట్టిన బాధ్యతను నెరవేర్చారు. పంచాయతీ కారోబార్, సిబ్బంది చేస్తున్న సమ్మెను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి గ్రామాల్లో సర్పంచ్‌లకు, ప్రజలకు ఇబ్బంది కాకుండా చూడాలని కోరుతున్నారు.

విద్యార్థులను అభినందించిన ఆర్డీఓ


విద్యార్థులను అభినందిస్తున్న ఆర్డీఓ

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని విజయసాయి హైస్కూల్‌కు చెందిన 14 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 10/10 జీపీఏ సాధించడంతో గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీవో రాజేశ్వర్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రణాళిక బద్ధమైన చదువుతో లక్ష్యాన్ని చేరుకోవచ్చని విద్యార్థులు నిరూపించారని ఆయన అన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవడానికి మంచిమార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. సమాజంలో ఆదర్శ వ్యక్తులుగా తయారు కావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, మేనేజర్ ఐ.ఆర్.చక్రవర్తి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కప్ పోటీలకు ఏర్పాట్లు

నవతెలంగాణ-ఎడపల్లి/ముప్కాల్/ఏర్గట్ల

గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభతోపాటు, సృజనాత్మకతను వెలికి తీసి వారిని మరింత ప్రోత్సహించాలననే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ముఖ్యమంత్రి కప్ 2023 క్రీడా పోటీల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయనున్నట్లు ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎడపల్లి మండల స్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాలలోపు వయసు ఉన్నవారు ఈ పోటీలో పాల్గొనేందుకు అర్హులని ఆయన తెలిపారు. మండల స్థాయి వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, క్రీడ పోటీలు ఉంటాయన్నారు. నైపుణ్యం గల యువతీ, యువకులు పైన పేర్కొన్న క్రీడా పోటీలో పాల్గొనేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు.

ఈనెల 15వరకు ఉదయం సీఎం కప్ క్రీడ పోటీలు ప్రారంభమవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తిగల యువతీయువకులు తాను ఆడబోయే క్రీడ పేరు నమోదు చేసి టీమ్‌గా ఏర్పడి సంబంధిత ఎంపీడీవో గోపాలకృష్ణకు సమర్పించాలని ఎంపీపీ శ్రీనివాస్ తెలిపారు. మండల స్థాయి సీఎం కప్ క్రీడల్లో ప్రతిభ కనబరిచిన జట్లను జిల్లా స్థాయిలో జరిగే సీఎం క్రీడా పోటీలకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీపీ కె.శ్రీనివాస్, ఎంపీడీవో గోపాలకృష్ణ, తహసీల్దార్ ఆకుల శేఖర్, ఏఎస్ఐ యూసుఫ్, ఉపాధి హామీ ఏపీఓ గంగారం, మండల వ్యవసాయ శాఖ అధికారి రామేశ్వరరావు, జానకంపేట్ ఎంపీటీసీ, బీఆర్ఎస్ పార్టీ ఎడపల్లి మండల ప్రధాన కార్యదర్శి మంద సంజీవ్‌కుమార్, పోచారం ఎంపీటీసీ పద్మ ముత్తన్న, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఎడపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సీఎం కప్ 2023 క్రీడోత్సవాలను విజయవంతం చేయండి : ఎంపీపీ సామ పద్మ

ముప్కాల్ : సీఎం కప్ 2023 క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని ముప్కాల్ ఎంపీపీ సామ పద్మ గురువారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15 నుంచి 17 వరకు మూడు రోజుల పాటు మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో సీఎం కప్ 2023 క్రీడోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల లోపు గల యువతీ,యువకులు క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, 100 మీటర్ల రన్నింగ్ పోటీలను చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల 30 నిమిషాల నుంచి 10:30 గంటల వరకు ఇట్టి క్రీడా పోటీలు కొనసాగుతాయని అన్నారు.

ఈ నెల 14 లోపు తమ తమ పేర్లను నమోదు గ్రామ పంచాయతీ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. గెలుపొం దిన క్రీడాకారులకు ప్రత్యేక బహుమ తులు అందజేయడం జరుగుతుందని, ప్రతిభ చూపిన యువతి యువకులను జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని ఎంపీపీ సామ పద్మ అన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీల కోసం పేర్లు నమోదు చేసుకోవాలి..

ఏర్గట్ల : సీఎం కప్ పోటీలలో పాల్గొనాలకునే ఆయా గ్రామాలకు చెందిన ఆసక్తి గల యువతీ, యువకులు ఈ నెల 12 శుక్రవారం లోగా పేర్లను తమ గ్రామపంచాయతీలలో కార్యదర్శి వద్ద ఆధార్ కార్డ్ జిరాక్స్ ఇచ్చి నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ రాజేశం ఒక ప్రకటనలో తెలిపారు. 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాలలోపు ఉన్న వారు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఇందులో భాగంగా కబడ్డీ, ఖోఖో, పరుగు పందెం మొదలగు పోటీలు నిర్వహించనున్నట్లు, ఈ పోటీలు తడపాకల్ గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో జరుగుతాయని పేర్కొన్నారు.

లబ్దిదారులకు అవగాహనా సదస్సు


అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో పశువైద్య, పశు-సంవర్ధక ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం అవగాహనా సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి కిరణ్ దేష్ పాండే, ఉమామ సహన మాట్లాడుతూ.. అర్హులైన గొల్ల, కురుమ లబ్దిదారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. జిల్లాలో గొర్రెల పంపిణీ కార్యక్రమం రెండో విడుత ఈ నెల చివరివరకు ప్రారంభం అవుతుందని, లబ్దిదారులు వారి వాటాను రూ.43,750 నెఫ్ట్ ద్వారా వారికిచ్చిన ఐడీతో జిల్లా కలెక్టర్ ఖాతాలోనే జమ చేయాలని వివరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పుప్పాల లక్ష్మి, ఎంపీటీసీ సత్యనారాయణ, గొర్రెల లబ్దిదారులు, వైద్య సిబ్బంది, వీఎల్ఓ గంగాజమున, జైల్‌సింగ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.